

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 194 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 14, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# కలియుగంలో.. కాలయముళ్లు !






## ప్రజల ప్రాణాలను తోడేస్తున్నారు



● ప్రజాస్వామ్యాన్ని పట్ట పగలే పారదోలుతున్నారు ● ప్రజల ఉసురు పోసుకుంటున్నారు ● ప్రమాదాలను సృష్టిస్తున్నారు ● ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారు ● రాజకీయ నాయకులు రాజకీయ యంత్రాంగాలుగా మారిపోతున్నారు ● బెంగాల్లో 4 వేల ఈవీఎంలు దగ్ధం చేశారు ● దేశవ్యాప్తంగా అక్రమ నిర్బంధాలు అక్రమ అరెస్టులు పెరిగిపోతున్నాయి ● వేల కోట్ల రూపాయలు దుబారా కాంట్రాక్టులకు కట్టపెడుతున్నారు ● ప్రధాని సొంత రాష్ట్రంలో మంచినీళ్ల కరువు ● కోట్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారు ● పరీక్షల లీకుతో విద్యార్థుల ప్రాణాలు తీస్తున్నారు ● ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న యువతను జైల్లో పెడుతున్నారు ● దేశంపై పట్టింపు లేదు ప్రజలపై ప్రేమ లేదు ఇది ఇక్కడి పాలన అర్థం కాదు ● ప్రజల ప్రాణాలను గాల్లోకి వదిలేసి విదేశాల్లో చక్కర్లు కొడుతున్నారు ● డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

భారతదేశంలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందనిని డాక్టర్ బరిగెల శివ ఆందోళన చెందారు.సొంత దేశంపై సొంత రాష్ట్రాలపై అభిమానాలు ప్రేమానురాగాలు చూపిస్తున్నట్లు నటిస్తూనే అత్యంత కష్టకాలంలోనికి ప్రజలను నెట్టివేస్తూ వాళ్లను ఆదుకోకుండా ప్రజల ప్రాణాలు పోతుంటే నిశ్శబ్దంగా చూస్తున్నారని మండిపడ్డారు.వేసవికాలంలో ఎండ తీవ్రతకు దేశవ్యాప్తంగా లెక్కలేనంతమంది మరణించారని వాళ్లను రక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఏ విధమైనటువంటి సహాయక చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు.పలు రాష్ట్రాలలో ప్రజల సమస్యలను గాలికి వదిలేస్తున్న ప్రభుత్వాలు ప్రజలు అంటేనే గిట్టకుండా మెదులుతున్నారని చివాట్లు పెట్టారు.ప్రజలకు కనీస నిత్యవసరాలను చేకూర్చకపోతే ప్రజలు బ్రతికేది ఎలా అంటూ సూటిగా నిలదీశారు.దేశంలో ఆకలి చావులు పెరిగిపోతున్నాయని అదే విధంగా రైతుల మరణాలు ఎక్కువ అవుతున్నాయని ప్రభుత్వాలను సూటిగా నిలదీశారు.ప్రజలను కష్టాల్లోనికి నెట్టి వాళ్లకు వాళ్లే చనిపోయే విధంగా చేస్తున్న ప్రభుత్వాలను ప్రభుత్వ నాయకులను కాలయముళ్ళ లాగా భావించాల్సి ఉంటుందని సూటిగా చెప్పారు.కలియుగం

- మిగతా 2లో..







## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

**విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ,జూన్13(జై భీమ్ న్యూస్):**

భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.




## అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

**తాళం పగులగొట్టి సోదాలు చేశారని టీఎంసి ఆరోపణ**



7

## ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

2

**గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం**
**మంత్రులతో కలిసి శంకుస్థాపన చేసిన భట్టి**

## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

**కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క**
**పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి**

6





## జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

**సీఎం సాహసవంతమైన నిర్ణయం**
**జర్నలిస్టులను ఆదుకోవడానికి నూతన మార్గాన్ని ఎంచుకున్న సీఎం**
**కాంగ్రెస్ పెద్దల సమక్షంలో జర్నలిస్టులకు హామీ**

5

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

**సీఎం సాహసవంతమైన నిర్ణయం.**
**జర్నలిస్టులను ఆదుకోవడానికి నూతన మార్గాన్ని ఎంచుకున్న సీఎం.**
**కాంగ్రెస్ పెద్దల సమక్షంలో జర్నలిస్టులకు హామీ.**

**న్యూఢిల్లీ జై భీమ్ న్యూస్:-**

జర్నలిస్టులకు సొసైటీల పేరుతో కాకుండా ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.న్యూఢిల్లీలో శనివారం జర్నలిస్టులతో జరిగిన భేటీలో సీఎం మాట్లాడుతూ, "జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే సంకల్పంతోనే కేబినెట్ సబ్ కమిటీ వేశాం. మీకు ఎలాంటి సమస్య ఉన్నా మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకురండి. సబ్ కమిటీ ఒకే చోట కూర్చొని సిఫార్సులు తీసుకువస్తే, మీరు టీ తాగే లోపే మినిట్స్ రాసి కేబినెట్‌లో ఆమోదిస్తాం" అని చెప్పారు.వ్యక్తిగతంగా ఇళ్ల స్థలాలు ఇచ్చే విధానం వల్ల భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు రాకుండా ఉంటాయని సీఎం వివరించారు. "సొసైటీలపై పిటిషన్ వేయడం సాధ్యమే, కానీ ఒక్కొక్కరి పేరు మీద ఇస్తే ఎవరూ పిటిషన్ వేయలేరు. ఒక్కొక్కరి పేరు మీదే వేయాల్సి వస్తుంది. అది ఆచరణ సాధ్యం కాదు. భవిష్యత్తులో ఈ ఇళ్ల స్థలాలపై ఎలాంటి వివాదాలు రాకూడదన్నదే మా ఉద్దేశం" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ నిర్ణయంతో వారి దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# జర్నలిస్ట్ కందుకూరి సంజీవ్ కుటుంబానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సానుభూతి





**హన్మకొండ, 13 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ కందుకూరి సంజీవ్ తల్లి కందుకూరి సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సమ్మక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే నాగరాజు, కందుకూరి సంజీవ్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాద సమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్న ఎమ్మెల్యే, సంజీవ్ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ ఆలయంలో జూన్ 17న నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ.. వేలాది మంది భక్తుల రాకకు ఏర్పాట్లు

**వరంగల్, 13 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 17న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆగమ శాస్త్ర సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ మహోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో భద్రాచలం అటవీ ప్రాంతాల నుంచి నాణ్యమైన కలపతో కొత్త ధ్వజస్తంభాన్ని సమకూర్చారు. దాదాపు రూ.7 లక్షల వ్యయంతో ఈ ధ్వజస్తంభాన్ని ఆలయానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ ఖర్చును ఆలయ ధర్మకర్త జారతి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు భరించారు. జూన్ 17న ఉదయం 8.36 గంటలకు కర్కాటక లగ్నంలో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు శ్రీ శ్రీ అభినవోదండ విద్యాశంకర భారతీ స్వామివారి కరకమలములచే ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ప్రతిష్ఠా మహోత్సవానికి ముందుగా ఈ నెల 15 నుంచి ప్రత్యేక యాగాలు, జలాధివాసం, ధాన్యాధివాసం, ఫలపుష్పాధివాస కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించనున్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ సమయంలో దర్శనం చేసుకునే భక్తులకు విశేష పుణ్యఫలాలు లభిస్తాయని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఆలయ సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర విధానాలకు అనుగుణంగా మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత కోరారు.




# కలియుగంలో కాలయముళ్ళు

మొదటి పేజీ తరువాయి

మొత్తం కసాయిమయం కన్నా అధ్వానమైన స్థితిలోనికి నెట్టివేయబడుతుందని అధికార బలుపుతో ప్రజల అణిచివేతను ప్రజల జీవన విధానంపై దెబ్బ కొట్టడం రాజకీయ నాయకులే కాదు రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారుల వంతు కూడా ప్రజల ప్రాణాలను తోడేయడానికి సహాయకరంగా ఉపయోగించుకుంటున్నారని నిల దీశారు.142 కోట్ల జనాభా కలిగిన భారతదేశం ఎంతటి వెనుక వాడుతనాన్ని అనుభవిస్తుందో కలియుగ పరిస్థితులను చూస్తే కాలమే సమాధానం చెబుతుందని గుర్తు చేశారు.ప్రజా సొమ్మును వేలకోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తున్నారో రాజకీయ నాయకులకే స్పష్టత లేకుండా పోతుందన్నారు.ఎంతో పరిణితి కలిగిన ప్రభుత్వ ఉన్నత అధికారులు సీనియర్ అధికారుల హోదాల్లో ఒకరకంగా ప్రస్తావించాల్సి వస్తే ప్రభుత్వాలను నడిపించే బాధ్యతను చేపట్టి ప్రజాధనాన్ని ప్రభుత్వాల పనుల కోసం ఖర్చు చేస్తూ శ్రమిస్తున్నామని తెలియజేస్తుండగా ప్రజల పరిస్థితిని ఇంతటి అద్వానమైన స్థితిలోనికి ఎందుకు నెట్టి వేయబడు తుందని సూటిగా ప్రశ్నించారు.ఒకవైపు ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తూనే వందలాది వేలాది సభల్లో ప్రజలను ఆదుకుంటామంటూ అబద్ధాలతో కూడిన మాటలను పలుకుతుండడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

**ప్రజలంటే ఎందుకింత చులకన..ప్రజల ప్రాణాలకు విలువ లేదా..!**

ప్రతి రాజకీయ నాయకుడు ప్రజల కోసం పరితపించిపోతున్నామంటూ ప్రజల కోసం చేసేదేమిటో తెలుపాల్సిన సందర్భాలు వస్తున్నప్పుడు పూర్తిగా ముఖం చాటేస్తున్నారని గుర్తు చేశారు.సంవత్సరాలు గడుస్తున్న అభివృద్ధి అంతరించిపోవడం ప్రజా అభివృద్ధి కుంటు పడడం ఒకరకంగా చెప్పాలంటే ప్రజా వ్యవస్థను నిర్మూలం చేయడం బాధాకరమన్నారు.ప్రజలను చులకన చూస్తున్నంత కాలం ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారన్నది గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.దేశవ్యాప్తంగా చట్టాలు, న్యాయస్థానాలు నిజాయితీ తప్పుతుండడం వల్లనే రాజకీయ నాయకులకు ప్రజలు చులకన అవుతున్నారని తెలిపారు.కారణం లేకుండా వేలాది లక్షలాది ప్రజల ఇండ్లను కూల్చివేస్తుండడం ప్రజల ప్రాణాలను తీస్తున్నట్లేనని గుర్తు చేశారు.అన్ని రాష్ట్రాలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం బిజెపి అనుబంధ రాష్ట్రాల్లో మతాల పేరు మీద లెక్కలేనంతమంది ప్రాణాలను తీస్తున్నారని బిజెపి వ్యతిరేక రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియను నాశనం చేస్తున్నారని దేశంలో ఏది జరగాలన్న ఏది జరగకూడదున్న బిజెపి అనుబంధం ఒప్పందంతో మాత్రమే జరిగే విధంగా నిరంతర ఆధిపత్యం కొరకు కేంద్ర ప్రభుత్వం ప్రజల మనోభావాలను చులకన చూస్తూ దేశవ్యాప్తంగా అణచివేతను కొనసాగిస్తూ ప్రజలకు ప్రజలే ప్రాణాలు తీసుకునే విధంగా చేస్తుందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం ఒకరకంగా చెప్పాలంటే ఆకాస్త ప్రభుత్వ వ్యవస్థను చంపడం లాంటిదేనని గుర్తు చేశారు.ప్రజల హక్కులను కాలరాస్తూ నిర్మూలిస్తుండడం వల్ల ప్రజల ప్రాణాలను తీసివేయడమేనన్నారు.

**దేశ పాలన పచ్చదనమా ప్రాణాంతకమా..**

దేశంలో ప్రజలు జీవించడం ఎంత కష్టంగా మారిపోతుందో ప్రభుత్వాలు అర్థం చేసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రతీ భారాన్ని ప్రజలపై మోపుతూ ప్రభుత్వాలు చేతులు దులుపుకోవడం ఆనవాయితీగా మారడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు.దేశంలో నిత్యవసరాల ధరలు 300 శాతం పెరిగిపోయాయని హెచ్చరించారు.191 లక్షల కోట్ల అప్పులు చేసి దేశాన్ని అభివృద్ధి చేశామంటూ అసత్యపు మాటలు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారన్నారు.140 కోట్ల భారతీయుల మీద ఒక్కొక్క తలపై ఒక లక్ష 80 వేల అప్పును చేసి మోసగించడం అభివృద్ధి ఎలా అవుతుంది అంటూ సూటిగా నిలదీశారు.ఏడాదికి దేశవ్యాప్తంగా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోసం చేసి 12 సంవత్సరాలలో 24 కోట్ల ఉద్యోగాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అత్యంత ప్రధాన ముఖ్యమైన ప్రభుత్వ వ్యవస్థను నేలమట్టానికి చేరువయ్యేలా నాశనం చేశారన్నది మాత్రం జగమెరిగిన సత్యమైన విషయమన్నారు.దేశవ్యాప్తంగా నిరుద్యోగం 25 శాతం పెరిగిపోవడంతో యువత చేతి పని లేక చదువులు పూర్తయి ఏం చేయాలో తోచక బలవన్మరణాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. కుటుంబాలకు భారంగా మారడం ఇష్టం లేక తనువులు చాలిస్తున్నారని బాధపడ్డారు.కొంత శాతం యువత పోరాటాల్లో అసువులు బాసున్నారని పేర్కొన్నారు. యువత పూర్తిగా నాశనం కావడానికి కేంద్ర ప్రభుత్వమే ప్రధాన కారణమని యువత జీవితాలను మెరుగుపరచాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించ కుండా రహస్యంగా ప్రాణాలు తీస్తుందని పరీక్ష ప్రశ్న పత్రాలు లీకులు చేస్తూ విద్యార్థుల ఉసురు పోసుకోవడమే కాకుండా విద్యార్థుల ప్రాణాలు తీస్తుందని దేశంలో ఎన్నడూ లేని విధంగా 12 సంవత్సరాల కాలంలో మనస్థాపాలకు గురై చనిపోయిన యువత కోట్ల రూపంలో ఉన్నారన్నది దేశం బాధపడే విషయంలో అతి ప్రాముఖ్యమైన అంశంగా పరిగణించాలన్నారు.మాకు ఉద్యోగాలు కల్పించండి అంటూ యువత వాళ్ళ రక్షణ కోసం పోరాటాలు చేస్తుంటే వాళ్లను అతి కిరాతకంగా నిర్బంధిస్తూ అక్రమంగా అరెస్టులు చేస్తూ దాడులు చేయిస్తూ కేసులు పెడుతూ జైల్లో పెడుతూ వాళ్ల జీవితాలను ఎందుకు అక్కరకు రాకుండా చేస్తున్నారని దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో కల్పించబడుతున్న అరకోర ఉద్యోగాలను ప్రభుత్వాలే అమ్ముకుంటున్నారని నిజాయితీగా చదువుకునే యువత ఉద్యోగాలు పొందుకోలేక సంవత్సరాల కాలం చదువుకుంటూనే మనస్థాపానికి గురై చనిపోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని దేశంలో కోట్ల మంది యువత ఐదు రూపాయల భోజనం తిని చదువుకుంటు న్నారని అంత దీనమైన దయనీయమైన దరిద్రమైన స్థితికి దేశం యువతను నెట్టివేయడమే కాకుండా వాళ్ళ జీవితాలతో చెలగాటలాడడం కేంద్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఎంతో ఆనందదాయకంగా మారిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై తిరగబడుతున్న యువతను విదేశీయుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విశ్లేషిస్తున్న మేధావులంతా 24 కోట్ల ఉద్యోగాలు కేంద్ర ప్రభుత్వం ఎందుకు కేటాయించలేకపోయింది అంటే మాత్రం సమాధానం చెప్పలేక తీవ్రమైన విమర్శలకు దిగుతున్నారని మేధావులే దేశ యువత పట్ల సరియైన విశ్లేషణ లేని విధానాలను ప్రదర్శిస్తే యువత జీవితాలు బాగుపడేది ఎలా అంటూ సూటిగా అడిగారు.దేశంలోని యువత ఉద్యోగాల కోసం విరోచిత పోరాటాలు చేస్తూ యువత జీవితాలు బాగుపడాలని కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేక ఉద్యమాలు చేస్తుంటే పరాయోడి కుట్రలంటూ అవహేళన చేస్తున్న మేధావులంతా దేశ ప్రధానమంత్రి విదేశాల చుట్టూ తిరుగుతూ అనేక రకాల సత్సంబంధాలను ఏర్పరచుకుంటూ దేశ ప్రయోజనాలను దేశ ఆర్థికమాన్యాన్ని దేశవ్యాపారంగాన్ని దేశ విద్యారంగాన్ని తాకట్టు పెడుతుంటే దాన్ని మాత్రం విశ్లేషించడం మేధావులకు గిట్టడం లేదన్నారు.మంచి చేసేవాడికి సహకరించకపోయిన పరవాలేదు గాని దూషించడం విమర్శించడం చెడుగా మాట్లాడడం మేధావులకు సరికాదన్నారు.79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మహిళలను నగ్నంగా ఊరేగించిన చరిత్రలు ఎక్కడా లేవని బిజెపి పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నారని వాటిని ఛాయాచిత్రాలుగా తీస్తూ ఆహ్లాదకరంగా ప్రవర్తిస్తూ సోషల్ మీడియాలో పెడుతూ ఎంతటి క్రూరమైన దుర్బుద్ధిని మహిళలపై ప్రదర్శిస్తున్నారో వాటిపై కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం నోరు మెదపడం లేదని ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు కూడా చలనం లేని విధంగా ప్రవర్తిస్తూ మహిళా జాతిని హీనాతి హీనంగా అవమాన పరుస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.అదేవిధంగా ఏడాదికి ఐదు లక్షల మంది ఆడబిడ్డలపై లైంగిక దాడులు జరగడం దేశ మహిళల పరిస్థితి ఎంత ఘోరంగా మారిపోయిందో దేశ యువత మహిళా రక్షణ కోసం తిరగబడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.12 ఏళ్లలో 329 లక్షల కోట్ల అధిక పన్నుల వసూళ్లకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వం అలా వసూళ్లకు పాల్పడిన ఆధారాలను పోగుచేసిన సొమ్ము లెక్కలను ఎక్కడ బయటపడకుండా జాగ్రత్త పడుతూ అలా పన్నుల వసూళ్లకు పాల్పడిన సొమ్మును అక్రమ పారిశ్రామికవేత్తలకు ధారాదత్తంగా ధారబోస్తున్నారని మండిపడ్డారు.దేశవ్యాప్తంగా ఏడాదికి 12,000 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడుతుంటే కేంద్ర ప్రభుత్వం రైతులపై మొసలి కన్నీరు కారుస్తూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి నిరాకరిస్తూ రైతుల జీవితాలపై వెన్నుపోటు పొడుస్తుందని హెచ్చరించారు.అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను కూడా రైతుల ధాన్యాలను కొనుగోలు చేయకుండా అడ్డుపడుతూ మొత్తం మీద దేశ రైతాంగ వ్యవస్థను సర్వనాశనం చేసే పరిస్థితిలకు తీసుకొస్తున్నారని హెచ్చరించారు.మతాల మధ్య చిచ్చుపెట్టే ఉన్మాద రాజకీయాలను ప్రేరేపిస్తున్నది కేంద్ర ప్రభుత్వం కాదా అంటూ సూటిగా నిలదీశారు మైనార్టీలను ఊచకోత కోయడం దేశంలో ఇదెక్కడి పరిపాలన అంటూ దేశ ప్రజలు కేంద్ర ప్రభుత్వ పాలనను తీవ్రంగా విమర్శిస్తున్నారని తెలిపారు.ప్రజల ప్రాణాలను తీయడం కోసం మతాలను అడ్డం పెట్టుకొని వేరే మతస్తులు దేశంలో బ్రతకడానికి వీలు లేదంటూ భారతదేశం పుట్టినప్పటి నుండి ఉన్నటువంటి ప్రజలను మతాల రూపంలో బంధిస్తూ దేశాన్ని మతమనే కబంధహస్తాల్లో బంధించి ఇతర మతస్తుల ప్రాణాలను కిరాతకంగా తీస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.ఆర్థిక వ్యవస్థను చిన్న భిన్నం చేస్తూ ప్రజలకు ప్రజలే ప్రాణాలు పోగొట్టుకునే విధంగా తీవ్రమైన ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు దేశ ప్రజల ప్రాణాలతో ఇంకెంతకాలం చలగాటలాడుతారో తెలియదు గానీ అధికారం కోసం ఎన్నికల కమిషన్ను,ఆస్తుల సంపాదన కోసం పోలీసు వ్యవస్థను,అక్రమంగా కేసుల నుండి ఉపశమనం పొందడం కోసం న్యాయస్థానాలను, అత్యున్నత స్థాయిలో వాడుకుంటూ దేశ ప్రయోజనాలను దేశ ప్రజల ప్రాణాలను తీవ్రంగా ముంచుతున్నారని హెచ్చరించారు.

# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట





## గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం మంత్రులతో కలసి శంకుస్థాపన చేసిన భట్టి

**మంచిర్యాల,జూన్13(జై భీమ్ న్యూస్):**

కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

# వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**రాయపర్తి (జై భీమ్ న్యూస్)**

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఆదేశాల మేరకు నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు పరామర్శించారు. వర్షాల ప్రభావంతో కొన్ని ఇళ్ల గోడలు కూలిపోవడంతో పాటు పలువురి ఇండ్లపై ఉన్న రేకులు ఎగిరిపోవడంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో నష్టపోయిన ముద్రబోయిన ముత్తయ్య, బండి కవిత,మచ్చ సరోజన, గుడికందుల మణెమ్మ కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు కలిసి వారి పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వశపాక ఎల్లయ్య, 6 వార్డు మెంబర్ బరిగెల కుమారస్వామి,కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు భాషబోయిన నాగరాజు, మాజీ వార్డు సభ్యుడు కొమరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వర్షాల వల్ల నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



# చిర్యాల భూవివాదం హత్యాయత్నం కేసులో మరో 14 మంది అరెస్ట్

**కీసర( జై భీమ్ న్యూస్)**

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని చిర్యాల గ్రామంలో సర్వే నంబర్ 156 భూమి వివాదానికి సంబంధించిన హత్యాయత్నం కేసులో మరో 14 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితులు పల్లె భద్రరెడ్డి, బొల్లంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పంజా సంజయ్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. పోలీసుల దర్యాప్తులో భాగంగా ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న పందేటి రాజా, బుఖ్య రమేష్, గొల్లేరు నాగరాజు, మరుత రాజశేఖర్, బంధాల ప్రవీణ్, హత్వాల అజయ్ కుమార్, దొంతి నాగ సందీప్, కుంట శ్రీనివాస్, సయ్యద్ అజాం, జమీల్ ఖాన్, అబ్దుల్ నదీం, ధర్మారపు ప్రియాంక, తన్నేరు శ్రావంతి, పిండి సుజాతలను శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, భూవివాదం నేపథ్యంలో ప్రధాన నిందితులతో కలిసి పై వ్యక్తులు చిర్యాల గ్రామంలోని వివాదాస్పద భూమి వద్దకు చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న వాచ్‌మన్ గోదుగు సాయికుమార్‌పై, అలాగే అతనిని రక్షించేందుకు వచ్చిన బాధితులు, సాక్షులపై ఇనుప రాడ్లు, హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడి చేసినట్లు వెల్లడైంది. ఈ దాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల వాంగ్మూలాలు, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు,




సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ప్రమేయాన్ని నిర్ధారించిన పోలీసులు ప్రత్యేక బృందాల సహాయంతో వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, దర్యాప్తు అధికారి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి మరియు పోలీసు సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అభినందించారు. ఇంకా కొంతమంది నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**ప్రజలకు హెచ్చరిక**

భూ వివాదాలు, సివిల్ వివాదాలను కోర్టులు లేదా రెవెన్యూ శాఖల ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. భూవివాదాల్లో రౌడీలను ఆశ్రయించడం, గుంపులుగా వెళ్లి దాడులకు పాల్పడడం వంటి చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డబ్బుకు ఆశపడి ఇటువంటి ఘటనల్లో పాల్గొనే వారు జైలుశిక్షతో పాటు రౌడీ షీట్లను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# కొమురవెల్లి మల్లన్న భక్తులకు శుభవార్త..

**త్వరలో అందుబాటులోకి కొమురవెల్లి రైల్వే స్టేషన్**




**సిద్దిపేట జిల్లా/కొమురవెల్లి, 13 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు శుభవార్త. ఇకపై కొమురవెల్లి క్షేత్రానికి రైలు మార్గంలో సులభంగా చేరుకునే అవకాశం కలగనుంది. కొత్తగా నిర్మిస్తున్న కొమురవెల్లి రైల్వే స్టేషన్ పనులు దాదాపు పూర్తికాగా, త్వరలోనే అధికారికంగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, కొమురవెల్లి పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీ పెంచడం లక్ష్యంగా ఈ రైల్వే స్టేషన్‌ను నిర్మించినట్లు తెలిపారు. రూ. 5.63 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు కూడా త్వరలో ముగించి స్టేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయం తెలంగాణలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభమైతే భక్తుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు, కొమురవెల్లి ప్రాంతానికి ఇతర ప్రాంతాలతో రవాణా అనుసంధానం మరింత మెరుగుపడనుంది.

## యూరియా యాప్‌కు వ్యతిరేకంగా ధర్నా

నిజామాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్): యూరియా యాప్ బంద్ చేయాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలో రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. ధర్మోరా గ్రామంలోని వ్యవసాయ గిడ్డంగికి తాళం వేసి, గిడ్డంగి ముందు టెంట్ వేసుకుని 2గంటల పాటు ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలోని గిడ్డంగిలో యూరియా ఉన్నా యాప్ లో తమకు బుక్ కాకుండా ఇతర గ్రామాల్లోని రైతులకు బుక్ అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యవసాయ అధికారి హరీష్ గిడ్డంగి కి వేసిన తాళం తీయాలని కోరగా రైతులు అందుకు అంగీకరించలేదు. తమ గ్రామంలో ఉన్న యూరియా సంచులు తమకే ఇవ్వాలని లేదంటే గిడ్డంగి తాళాలు తీసేదే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చల్లగరిగలో పోలీసుల ఉక్కుపాదం

**గుడుంబా, నిషేధిత గుట్కాపై దాడులు.. ముగ్గురిపై కేసులు**



**చిట్యాల, 13 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ చిట్యాల పోలీసులు చల్లగరిగ గ్రామంలో శనివారం విస్తృత స్థాయిలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ ఆధ్వర్యంలో, ఎస్ఐ పోచంపల్లి సతీష్ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీల్లో 15 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని వీధులు, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు అక్రమంగా గుడుంబా, నిషేధిత గుట్కా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. గుడుంబా విక్రయిస్తూ పట్టుబడిన కేతిరి సదయ్య, శ్రీపతి బిక్షపతి, నిషేధిత అంబర్ గుట్కా విక్రయిస్తున్న బామర్ హీరా సింగ్‌లపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్న పోలీసులు, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 300 లీటర్ల పానకాన్ని గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే బామర్ హీరా సింగ్ వద్ద నుంచి సుమారు రూ.4,398 విలువైన నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. గంజాయి, గుడుంబా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు పోలీసులు సూచించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు రాజన్, ఈశ్వరయ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జీడిమెట్లలో 7 మంది బంగ్లాదేశ్ జాతీయులు అరెస్ట్




**హైద్రాబాద్, 13 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశ్ జాతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు గజులరామారం--జీడిమెట్ల ప్రాంతంలోని హెచ్‌ఏఎల్ ఏరియాలో ఉన్న ఓ అద్దె ఇంట్లో కొందరు విదేశీయులు అక్రమంగా నివసిస్తున్నట్లు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ తన బృందంతో కలిసి ఆ ఇంటిపై సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో వారి వద్ద భారతదేశంలో చట్టబద్ధంగా నివసించేందుకు అవసరమైన పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే ప్రయాణ పత్రాలు లేవని తేలింది. వారు అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించి దేశంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) మరియు ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు వారిపై నిర్బంధ, కదలికల నియంత్రణ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం వారిని మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. చట్టపరమైన విధానాల ప్రకారం వారి బహిష్కరణ ప్రక్రియను ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత అధికారుల ధృవీకరణ, ఇతర లాంఛనాలు పూర్తయిన అనంతరం వారిని బంగ్లాదేశ్‌కు బహిష్కరించి స్వదేశానికి పంపించనున్నట్లు వెల్లడించారు.

# రేపటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం ప్రారంభం




**హన్మకొండ, 13 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల పోషకాహార స్థితి మెరుగుపర్చడంతో పాటు పాఠశాల హాజరు శాతాన్ని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అల్పాహార కార్యక్రమం జూన్ 15 నుంచి ప్రారంభం కానుంది. పాఠశాల విద్యాసంవత్సరం పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మొదటి దశలో హనుమకొండ, కాజీపేట మండలాల్లోని 86 పాఠశాలలను ఈ పథకానికి ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారంతో పాటు పాలు అందించనున్నారు. అలాగే వారంలో మూడు రోజుల పాటు రాగిజావను కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు. ఈ కార్యక్రమం అమలుకు సంబంధించి హనుమకొండ, కాజీపేట మండలాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి

**పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ డిమాండ్**

**భువనగిరి,జూన్13(జై భీమ్ న్యూస్):**

భువనగిరి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు అన్ని పూర్తయిన నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని, నెల రోజుల్‌లో ప్రారంభించకుంటే వీధి వ్యాపారులతో ప్రారంభం చేయిస్తామని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవి.కిరణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను శనివారం పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏవి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో వీధి వ్యాపారస్తులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను అన్ని వసతులతో నిర్మించడం జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల కాలం గడిచిపోయిన ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వీధి వ్యాపారులకు శాపంగా మారిందన్నారు. నిర్మించిన భవనంలోని ఎలక్ట్రికల్ వైర్లు, ప్రహారికి నిర్మించిన గ్రిల్స్ ను కట్ చేసి దొంగలించిన వస్తువుల విలువ సుమారూ రూ.25 లక్షలని మున్సిపల్ కమిషనర్, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు దర్యాప్తునకు నోటుకోలేదన్నారు. భువనగిరి ఎమ్మెల్యే అతడి క్యాంప్ కార్యాలయ ఆవరణలోనే ఉన్నా కూడా మార్కెట్‌ను పరిశీలించకపోవడం, దానిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తూ ఉంటే భువనగిరి పట్టణంపై అతనికి ఉన్న ప్రేమ నామ మాత్రమే అని పట్టణ ప్రజలకు అనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# 21న నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి**
**అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు**
**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ వెల్లడి**

విజయవాడ,జూన్13(జై భీమ్ న్యూస్): ఈ నెల 21వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం అయ్యేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ నెల 21న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎం. రాజశేఖర్ బాబు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తదితరులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి వివిధ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సుమారు 5,000 మంది యోగా సాధకులు, విద్యార్థులు, ప్రజలు యోగా ఆసనాల్లో పాల్గొనేందుకు రానున్నరన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపల్, పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకవర్షం కురిసే అవకాశం ఉంటే కార్యక్రమాన్ని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందస్తుగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, విద్యార్థులు, యోగా సాధకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పూర్తి చేసి, ప్రాంగణాన్ని సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## తెలుగు సాహిత్యంలో రైతు జీవితం

**మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్ర ఆవిష్కరణ**

**నల్లగొండ,జూన్13(జై భీమ్ న్యూస్):**

తెలుగు సాహిత్యంలో రైతు జీవితాన్ని మేరెడ్డి యాదగిరి రెడ్డి సమగ్రంగా ఆవిష్కరించారని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ సాహిత్య అకాడమీ, సృజన సాహితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మేరెడ్డి యాదగిరి రెడ్డి సాహిత్య సమాలోచన ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా నిబద్ధతతో అనేక ప్రక్రియలలో మేరెడ్డి యాదగిరిరెడ్డి సాహిత్య సృజన చేశారని కొనియాడారు. ముఖ్యంగా కథా సాహిత్యంలో తెలంగాణ గ్రామీణ ప్లలెను గ్రామీణ జీవితాన్ని రైతుల జీవితాలను చక్కగా చిత్రించారన్నారు. డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ నవలా రచయిత శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ.. మేరెడ్డి యాదగిరి రెడ్డి అట్టడుగు వర్గాల జీవితాలను సాహిత్య కాన్వాస్ పై ఆవిష్కరించారన్నారు. పాలపిట్ట సంపాదకుడు గుడిపాటి మాట్లాడుతూ తెలుగు కథా సాహిత్యంలో మేరెడ్డి యాదగిరిరెడ్డి తనదైన ముద్రవేశారన్నారు. నాలుగు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి కథలు రైతు జీవితం అనే అంశంపై ప్రసంగించారు. డా.పొట్టబత్తుల రామకృష్ణ మేరెడ్డి యాదగిరి రెడ్డి కవిత్వం అనే అంశంపై ప్రసంగించారు. డా.ఉప్పల పద్మ 'మేరెడ్డి యాదగిరిరెడ్డి బాలసాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ సి.అనిత కుమారి మేరెడ్డి మినీ కవిత్వం వస్తు శిల్పాలు అనే అంశంపై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం పలువురు కవులు పాల్గొన్నారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

**దర్శనానికి 24గంటల సమయం**

తిరుమల,జూన్13(జై భీమ్ న్యూస్): వేసవి సెలవులు ముగిస్తుండటంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుమల గిరులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో నిండాయి. స్వామివారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం సర్వదర్శన భక్తులను బాట గంగమ్మ ఆలయం నుంచి సర్వదర్శన క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. క్యూలైన్లలో భక్తులకు అల్పాహారం, తాగు నీరు, పాలు వంటివి శ్రీవారి సేవకుల ద్వారా అధికారులు అందజేస్తున్నారు. సీఆర్వో వద్ద వసతి గదుల కోసం, కళ్యాణకట్ట కేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు.

## పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం

**విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.58.94 లక్షల లూటీ**

సంగారెడ్డి,జూన్13(జై భీమ్ న్యూస్): పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ.58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ.538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ.2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది, అరెస్ట్ చేయాల్సి ఉంటుంది' అంటూ ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన మోహన్ రెడ్డి, దశలవారీగా పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.58.94 లక్షలు బదిలీ చేశారు. అనంతరం ఇది మోసమని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్లు తరచుగా అధికారులుగా నటిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు సూచించారు.

## అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

**ఐదురుగు వైమానికి సిబ్బంది మృతిచెందినట్లు సమాచారం**

**గౌహతి,జూన్13(జై భీమ్ న్యూస్):**

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## పాస్ పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీస్ భేష్

**19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు**

హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్): పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

## బిజెపి కుట్రలకు మీనాక్షి బలి

**ఎలాంటి కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ**
**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శ**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా? లేక నియంత దేశంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్‌పై కేసు ఏమీ లేదని.. నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బిజెపి కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆఫీసు కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ విషయంలో ఉరి వేసినా తప్పులేదన్నారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. మీనాక్షి తనకు సోదరి లాంటివారన్నారు. 24 గంటల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్పందించకపోవడం విచారకరమని తెలిపారు.మీనాక్షిని బలి చేశారని.. ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. బీజేపీ నేతలు దిగజారి ప్రవర్తిస్తున్నారని విమర్శలు గుప్పించారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని... అంత మాత్రాన కుట్రకు పాల్పడరన్నారు. ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని ఇంతలా దిగజారి ప్రవర్తించడం బాధాకరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు మృతి

**స్థానికుల ఆందోళన.. కంపెనీ ముందు ధర్నా**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

నగరంలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కారు చక్రాల కింద పడి మూడేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన కారు కిందే బాలుడు శివం పడిపోయాడు. తీవ్ర గాయాలయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ ముందు ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ కంపెనీ ఎదుట బైఠాయించి బంధువులు, కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. న్యాయం జరిగేలా చూస్తామంటూ పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో లింగనిర్ధారణ

**డెకాయ్ ఆపనరేషన్‌లో గుర్తించిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

వనస్థలిపురంలో లింగ నిర్ధరణ పరీక్షల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హయగ్రీవ ఆసుపత్రిలో పోలీసులు నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఈ విషయం బయట పడింది. తొలుత మఫ్టీలో ఉన్న మహిళా కానిస్టేబుల్‌ను ఆసుపత్రికి పంపించారు. లింగనిర్ధరణ పరీక్షల గురించి ఆరా తీయగా.. చేస్తామని ఆసుపత్రి డైరెక్టర్, రిసెప్షనిస్ట్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఆమెను తుక్కుగూడ ల్యాబ్ టెక్నీషియన్ వద్దకు రిఫర్ చేశారు. మహిళా కానిస్టేబుల్‌తో పాటు తుక్కుగూడలోని శ్రీసాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్‌కు చేరుకున్న పోలీసులు.. అక్కడ లింగ నిర్ధరణ పరీక్షలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. హయగ్రీవ ఆసుపత్రి డైరెక్టర్ కొర్ర రాజు, లోకేశ్, విజయ్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతికూల వాతావరణం

**శంషాబాద్ విమానాల దారి మళ్లింపు**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, దిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్) :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో.. ఆయన స్టేట్‌మెంట్‌ను సిట్ రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికెళ్లి.. ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

## కుటుంబ కలహాలతో గర్భిణి ఆత్మహత్య

**సంగారెడ్డి,జూన్13(జై భీమ్ న్యూస్):**

జహీరాబాద్ మండలం హో(తి)కె డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలు.. ఒక నిండు గర్భిణి ప్రాణాన్ని బలితీసుకున్నాయి. సదరు మహిళ కుటుంబంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గర్భిణి.. దారుణమైన నిర్ణయం తీసుకుంది. రెండంతస్తుల ఇంటి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భవనం పైనుంచి కిందకు దూకడంతో ఆమెకు తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న జహీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి భర్త, అత్తను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

## సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంచాలి

**కిషన్ రెడ్డికి ఎంపి వంశీకృష్ణ సవాల్**

**మంచిర్యాల,జూన్13(జై భీమ్ న్యూస్):**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ సవాల్ విసిరారు. సింగరేణి కార్మికులపై కేంద్రానికి నిజంగానే ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే... రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను తక్షణమే పెంచి చూపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని గుండెల్లో మోసి... ఉద్యమాన్ని ముందుకు నడిపిన వీరులు సింగరేణి కార్మికులని ఆయన కొనియాడారు. మంచిర్యాల వేదికగాశ్రీరాంపూర్ సింగరేణి ఏరియా ఆధ్వర్యంలో... ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సింగరేణి కారుణ్య నియామకాల పత్రాల పంపిణీ జరిగింది. డిపెండెంట్ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు... ఈసందర్భంగా ఎంపీ వంశీకృష్ణ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం... రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపు కోసం... పార్లమెంట్‌లో గళం విప్పాను, ఇకముందూ గళం విప్పుతూనే ఉంటా అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో రూ.150 కోట్ల భారీ వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సింగరేణి కార్మికులు అనగానే... అందరికీ గుర్తొచ్చేది కాకా వెంకటస్వామి అని... నాడు నష్టాల్లో, అప్పుల్లో ఉన్న సింగరేణి సంస్థను కాపాడిన మహోన్నత వ్యక్తి కాకా అని ఆయన గుర్తుచేశారు. సింగరేణి ఉద్యోగులకు ఐటీ పర్క్స్ (ఎ÷ు ఖ၊సీబ) నుంచి మినహాయింపు ఇవ్వాలని, అలాగే సింగరేణిలో మారుపేరు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు సుఖంగా ఉంటేనే సంస్థ బాగుంటుందని... కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో పార్లమెంట్ వేదికగా అలుపెరగని పోరాటం చేస్తానని ఎంపీ వంశీకృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచారణకు ఎంపి హాజరు

**బిఆర్ఎస్ నీచంగా వ్యవహరించిందన్న అనిల్ కుమార్ యాదవ్**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ వేగవంతమైంది. ఇందులో భాగంగా శనివారం కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను ప్రత్యేక విచారణ బృందం సిట్ సుదీర్ఘంగా విచారించింది. జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో దాదాపు అరగంట పాటు ఈ విచారణ కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో అనిల్ కుమార్ యాదవ్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించిన పోలీసులు, ఇందుకు సంబంధించిన కొన్ని సాంకేతిక ఆధారాలను ఆయన ముందు ఉంచి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఏ ఏ రోజుల్లో, ఏ సమయాల్లో ఫోన్ కాల్స్ ట్యాప్ చేశారనే వివరాలను అధికారులు ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఇదే కేసులో అనిల్ కుమార్ యాదవ్ తండ్రి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ నిర్ధారించింది. అయితే, ఆయన వయోభారం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నేరుగా వారి ఇంటికే వెళ్లి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారు. సిట్ విచారణ అనంతరం ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ అత్యంత నీచ రాజకీయాలకు పాల్పడింది. నా ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు గుర్తించి నన్ను విచారణకు పిలిచారు. ఏ రోజు, ఏ టైమ్‌కు ట్యాపింగ్ జరిగిందో కొన్ని కీలక ఆధారాలను నా ముందు ఉంచి వివరాలు అడిగారు. అప్పట్లో మా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం మేము పార్టీ కార్యక్రమాలను ఆర్గనైజ్ చేసేవాళ్లం. అయితే, మేము ఏదైనా కార్యక్రమం తలపెట్టి ఇంటోంచి గడప దాటకముందే మా ఇంటి ముందు పోలీసులు వాలిపోయేవారు. మాకు అప్పట్లో అస్సలు అర్థం కాలేదు.. మేము ఎ÷-లాన్ చేసుకున్న విషయాలు పోలీసులకు ఎలా తెలుస్తున్నాయా అని ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు సిట్ ఆధారాలు చూపిస్తుంటే అసలు విషయం అర్థమైంది'. అని అనిల్ కుమార్ యాదవ్ చెప్పారు. తనతో పాటు తన తండ్రి అంజన్ కుమార్ యాదవ్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని అనిల్ కుమార్ మండిపడ్డారు. ఆయన స్టేట్‌మెంట్ తీసుకోవడానికి అధికారులు ఇంటికి వస్తామని చెప్పారని ఆయన వెల్లడించారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులు ఎంతటివారైనా సరే చట్టపరంగా శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

## సిరిసిల్ల మనబడి-మనబాధ్యతలో బండి

**ఎస్పీ హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం**





రాజన్న సిరిసిల్ల,జూన్13(జై భీమ్ న్యూస్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'మన బడి-మన బాధ్యత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే హాజరు కాకపోవడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే ఉండటంతో.. 'ఎస్పీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్రమంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరాలని వ్యంగ్యంగా అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ ఆదేశించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## సింగరేణిలో బొగ్గు మయంపై విచారణ

**సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

## అసలు ఓట్లు తొలగించే కుట్ర: కెటిఆర్

**రాజన్న సిరిసిల్ల,జూన్13(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' ప్రక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతుభరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో దొంగ ఓట్లతో అసలైన ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

## రైతుల సంక్షేమం లక్ష్యంగా కృషి

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ,జూన్13(జై భీమ్ న్యూస్):**

రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని... గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. శనివారం నల్గొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్ - 2026ను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లా పేరు చెప్పగానే బత్తాయి తోటలు గుర్తుకు వస్తాయని మంత్రి కోమటిరెడ్డి ప్రస్తావించారు. గత నాలుగు దశాబ్దాలుగా వేలాదిమంది రైతుల జీవనాధారంగా బత్తాయి సాగు చేస్తున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని చెప్పుకొచ్చారు. గతంలో స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం తనకు ఉందని వివరించారు. గత సంవత్సరం వరకు బత్తాయి రైతులకు ప్రత్యేకంగా ఓ వేదిక లేకపోవడం లోటుగా ఉండేదని అన్నారు. పుస్తకాల్లో ఉండే శాస్త్రీయ జ్ఞానం రైతుల పొలాల వరకు చేరినప్పుడే వ్యవసాయ రంగంలో నిజమైన మార్పు వస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

**పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు**
**మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్య**

**కర్నూలు,జూన్13(జై భీమ్ న్యూస్):**

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. ఈ పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈరోజు(శనివారం) మంత్రి భరత్ కర్నూల్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 19 కంపెనీల్లో 1460 ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఒక్కరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహిస్తామని మంత్రి భరత్ వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు సృష్టించేందుకు కష్టపడుతున్నామని చెప్పుకొచ్చారు. ఓర్వకల్లుకు గతంలో ఎప్పుడు లేనంతగా కంపెనీలను తీసుకువస్తున్నామని తెలిపారు. రిలయన్స్, అగస్త్య కంపెనీలను కర్నూలుకు తీసుకువచ్చామని ప్రస్తావించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడిని పెడుతోందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ప్రపంచంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంటుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే దేశంలోకి వచ్చే 25 శాతం పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని మంత్రి భరత్ పేర్కొన్నారు.

## షాదీముబారక్‌లో అక్రమాలు

**ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

షాదీ ముబారక్ పథకంలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సహా ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బండ్లగూడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కిరణ్, ఇత్తేమాద్, అక్బర్, ముషారఫ్, సర్ఫరాజ్, జఫ్ఫార్‌లు అరెస్టైన వారిలో ఉన్నారు. షాదీ ముబారక్ పథకంలో వీరు రూ.30 లక్షల మేర కాజేశారు. ఐదుగురు నిందితులు.. నకిలీ డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు సృష్టించి ఈ స్కీమ్‌కు తప్పుడు దరఖాస్తులు సమర్పించారు. ఆర్ఐ అశోక్‌కిరణ్ కమీషన్ తీసుకుని ఈ దరఖాస్తులను ప్రాసెస్ చేశారు. రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ అక్రమాలను గుర్తించారు. నిందితులను అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు.

## వీబీజీ రాంజీ స్కీం పట్ల ప్రభుత్వ నిరసన

**కేంద్రానికి లేఖ రాస్తామన్న మంత్రి సీతక్క**

**పథకం అమలుపై అధికారులతో సమీక్షించిన మంత్రి**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

కేంద్రం జులై 1వ తేదీ నుంచి అమలు చేయాలని తలపెట్టిన వీబీజీ రాంజీ స్కీం పట్ల నిరసన తెలపాలని తమ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తమ నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. వీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మాణం చేశామని ప్రస్తావించారు. ఈ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు, ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కశనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీకి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం నిధులు కేంద్రం నుంచి రావాలన్నా నూతన స్కీంను అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు నూతన పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో నూతన పథకంపై అవలంబిస్తున్న విధానంపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నూతన పథకం అమలుపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా.. నార్మెటివ్ పద్ధతిలో పని దినాలు కేటాయించే విధానాన్ని సవరించాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధికి బ్రేక్ ఇవ్వాలన్న క్లాజ్‌ను తొలగించాలని అన్నారు. పంట సీజన్ కాలంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వివరించారు. ఆ సమయంలోనే వన మహోత్సవాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను ఉపాధి హామీ ద్వారా చేపడుతామని తెలిపారు. పంట సీజన్‌లో ఉపాధికి 60 రోజుల బ్రేక్ ఇస్తే.. మొక్కలు నాడటం ఆగిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. అది కేందప్రభుత్వం తీసుకువచ్చిన గ్రీన్ ఇండియా క్యాంపెయిన్‌కు విరుద్ధమని అన్నారు. ఆదివాసీ, కొండ ప్రాంతాల్లో పంట సీజన్ 60 రోజులు కూడా ఉండదని చెప్పారు. ఒకసారి పనులు మొదలుపెట్టాకా.. 60 రోజుల బ్రేక్ ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు. ప్రస్తుత ఉపాధి హామీ విధానం నుంచి నూతన విధానంలోకి ఒక్కసారిగా మారడం కష్టమని చెప్పారు. అందుకే ఆయా రాష్ట్రాలకు కాస్త వెసులుబాటు ఇచ్చేలా నూతన చట్ట అమలును వాయిదా వేయాలని సూచించారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో వీబీజీ రాంజీని అమలు చేయాల్సి వస్తే.. ఉపాధి కూలీలకు ఏలాంటి నష్టం లేకుండా తాము చూస్తామని అన్నారు. అందుకనుగుణంగా జరిగే నష్టాన్ని రాష్ట్రం తరుపున భర్తీ చేసేందుకు ముసాయిదా రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో చర్చించిన తర్వాత నూతనపథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## మద్యపాన నిషేధం పేరుతో దోపిడీ

**వైసిపి ప్రభుత్వ హాయంలో పెద్ద ఎత్తున అక్రమాలు**
**మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శలు**

**అమరావతి,జూన్13(జై భీమ్ న్యూస్) :**

మద్యపాన నిషేధం చేస్తామని మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్దిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు. చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కంపెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసి వేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

## మహిళలను కించపర్చేలా వ్యాఖ్యలు

**షబ్బీర్ అలీకి ఎఐసిసి షోకాజ్ నోటీస్**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

**తాళం పగులగొట్టి సోదాలు చేశారని టీఎంసి ఆరోపణ**



**కోల్‌కతా,జూన్13(జై భీమ్ న్యూస్):**

తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ కోసం గాలిస్తున్న పోలీసులు కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి వెళ్లి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించినట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. సోదాల అనంతరం పోలీస్ టీమ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విషయం తెలిసిన పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు ఆశచూపి కొందరి నుంచి సుమిత్ రాయ్ డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలకు సంబంధించి కోల్‌కతా పోలీసులు ఈ సోదాలు జరిపినట్టు చెబుతున్నారు. పోలీసుల తనిఖీలపై అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. పోలీసులు వచ్చినప్పుడు తన ఇంటికి తాళం వేసి ఉందని, తాళాలు పగులగొట్టి మరీ సోదాలు జరిపారని చెప్పారు. 'నా ఇల్లు మొత్తం గాలించారు. ఆయనను (సుమిత్ రాయ్) నేను దాచిపెట్టానో లేదో దర్యాప్తు ఏజెన్సీని అడగండి' అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దీనికి ముందు శుక్రవారంనాడు అభిషేక్ బెనర్జీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసిన ఆరోపణలపై జూన్ 16న తమ ముందు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. నేరుగా నోటీసులు అందజేసేందుకు అభిషేక్ నివాసానికి సీఐడీ టీమ్ వెళ్లింది. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో సుమారు రెండు గంటల వేచి చూసిన అధికారులు కార్యాలయంలోని ఉద్యోగులకు నోటీసు అందజేసి వెళ్లిపోయారు. అభిషేక్ వ్యాఖ్యలపై బాగుయాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తొలుత విచారణ జరిపారు. అనంతరం కేసును సీఐడీకి అప్పగించారు. కాగా, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రాకు చెందిన పలు నివాసాలపై ఈడీ అధికారులు శనివారంనాడు దాడులు జరిపారు. భవానీపూర్‌లోని ఆయన నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిపినట్టు తెలుస్తోంది. మున్సిపల్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి ఈడీ ఈ దాడులు జరిపినట్టు చెబుతున్నారు.

# జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

**అక్రమంగా వచ్చినట్లు గుర్తింపు**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**


హైదరాబాద్ జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు. గాజులరామారం హెచ్‌ఏఎల్ కాలనీలో అ÷-దదె ఇంట్లో బంగ్లా జాతీయులు నివాసం ఉంటున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి ఇళ్లలో సోదాలు నిర్వహించగా.. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేవని గుర్తించారు. ఇతర డాక్యుమెంట్లు లేకుండానే భారత్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాల్లోనూ బంగ్లాదేశీయులు చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. కుత్బుల్లాపూర్ డీసీపీ ఆదేశాల మేరకు వీరిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయులను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిని మెదక్ జిల్లా జోగిపేట డిపోర్టేషన్ సెంటర్‌కు తరలించారు. వీరిందరినీ తిరిగి వారి దేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# రెండేళ్లలో ఆరోగ్యశాఖలో గణనీయమైన ప్రగతి

**పేదల చెంతకు వైద్యారోగ్య సేవలు**

**ప్రభుత్వాసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్య**

**వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి**



**విజయవాడ,జూన్ 13(జై భీమ్ న్యూస్):**

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని.. గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు. రెండేళ్లలో హెల్త్ సెక్టార్‌లో గణనీయమైన మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గొప్పగా చెబుతున్నామన్నారు. ఇందుకు సహకారం అందజేసిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆరోగ్య శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు పని చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నేడు ప్రజల్లో సంతృప్తికరమైన వాతావరణం నెలకొల్పామన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ఆరోగ్యాంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. తమకు అన్ని విధాలా సహకారం అందిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఏపీలో బాధ్యతతో మెలిగే ప్రతిపక్షం లేదని.. గత ఐదేళ్ల కాలంలో జగన్ ఆరోగ్య శాఖను అనారోగ్య శాఖగా మార్చారని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్ల తాము చాలా సమర్ధనీయంగా పని చేశామన్నారు. తమకు ఛాలెంజింగ్ పని అప్పగించిన జగన్‌కు కూడా ధన్యవాదాలు అని అన్నారు. ÷ళిడు ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టీవ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా... తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు.

# మ్యాగీ నూడిల్స్‌లో పురుగులు

**సోషల్ మీడియా వార్తలను ఖండించిన నెస్లే**

**న్యూఢిల్లీ,జూన్13(జై భీమ్ న్యూస్):**

మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై నెస్లే ఇండియా సంస్థ స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. మ్యాగీ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని ఓ నెటిజన్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశంపై చర్చ మొదలైంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఈ ఫిర్యాదుపై దృష్టి సారించి, సంస్థ నుంచి వివరణ కోరింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో నెస్లే స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌పై ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చాయని నెస్లే ఇండియా స్పష్టం చేసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి నమూనా పంపించాలని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనా రాలేదని తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తి నమూనాను పరిశీలించే అవకాశం లభించలేదని పేర్కొంది. ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్టు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు కనిపించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి అనుగుణంగా ఉందని రిపోర్ట్ వచ్చినట్టు కంపెనీ పేర్కొంది. వినియోగదారుల భద్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని కంపెనీ మరోసారి స్పష్టం చేసింది.

# తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు

**కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మృతి**



**కాకినాడ,జూన్13(జై భీమ్ న్యూస్):**

తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటనతో కేసు దర్యాప్తులో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో ఆమె వెంట వెళ్లిన పెంపుడు కుక్క కూడా కొంతకాలం కనిపించకుండా పోయింది. మూడు రోజుల తర్వాత కుక్క తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత నుంచి అది విచిత్రంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు దాన్ని పర్యవేక్షణలో ఉంచారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. దాని కదలికలను నిన్న ప్రత్యేకంగా పరిశీలించారు. చిన్నారి అదృశ్యం కేసులో ఆ కుక్క కీలక ఆధారాలు ఇవ్వవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో డాగ్ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే, గత రెండు రోజులుగా కుక్క ఆరోగ్యం క్షీణించడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. గతరాత్రి కుక్కకు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ అనూహ్య ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి అదృశ్యం కేసులో పెంపుడు కుక్క మృతి కారణంగా కీలక ఆధారం కోల్పోయినట్లయింది. ఇప్పటివరకు ఆ కుక్క కదలికల ద్వారా కొంత సమాచారం లభించవచ్చని పోలీసులు ఆశించారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారిని ఎవరైనా అపహరించారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో తుని, కాకినాడ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది.

# సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ

**మంచిర్యాల,జూన్13(జై భీమ్ న్యూస్):**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి, బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన యువత క్రమశిక్షణతో పనిచేసి సింగరేణి పురోభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణిని మరింత లాభాల బాటలో నడిపించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూనే, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు విఠల్), స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్యేలు మకాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణతో పాటు సింగరేణి ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

**పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం**

**అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్**

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం**

**హైదరాబాద్,జూన్13(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

# గడువుకు ముందే పంజాబ్ ఎన్నికలు

**పార్టీ కార్యాకర్తలు ప్రచారంలోకి దిగండి**

**నవంబర్‌లోనే ఎన్నికలు జరిగే ఛాన్స్**

**ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంకేతాలు**

చండీగఢ్,జూన్13(జై భీమ్ న్యూస్): పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరిగే అవకాశం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంకేతాలిచ్చారు. 2027 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2026 నవంబర్‌లోనే ఎన్నికలు జరగవచ్చని అన్నారు. 'ఆప్' ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని ప్రకటించారు. బటిండాలో శనివారంనాడు జరిగిన రోడ్‌షోలో కేజ్రీవాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు తక్షణం ఎన్నికల ప్రచారానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముందస్తు ఎన్నికలకు కారణాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలిచిన ఓటర్లకు కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు. బర్నాలా, మోగా, బటాలా, బటిండా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లుగా ఆప్ కౌన్సిలర్లు ఎన్నికయ్యారని, పార్టీ పాలనపై ప్రజలకున్న నమ్మకాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా భగవంత్ మాన్ కొనసాగుతారని, మరోసారి మాన్ సీఎం అయ్యేందుకు పార్టీ కార్యకర్తలందరూ కృషి చేయాలని కేజ్రీవాల్ కోరారు. గత నాలుగేళ్లుగా పంజాబ్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని, మద్దతును సాధించిందని అన్నారు. పార్టీల పేరు చెప్పకుండా విపక్షాలపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. ఒకటి 'చిట్టా పార్టీ', మరొకటి 'ఫైటింగ్ పార్టీ', మూడో పార్టీ 'ఈడీ పార్టీ' అని అభివర్ణించారు. డ్రగ్స్ సమస్యలు, అంతర్గత పోరాటాలు, సెంట్రల్ ఏజెన్సీలతో ప్రత్యర్థులను భయపెట్టే పార్టీలుగా వారిని పోల్చారు. ప్రజాసంక్షేమ, అభివృద్ధి కోసం పని చేసే పార్టీ ఆప్ మాత్రమేనని, పంజాబ్ నేతల్లో అత్యంత నిజాయితీ కలిగిన ముఖ్యమంత్రుల్లో భగవంత్ మాన్ ఒకరని ప్రశంసించారు. గత ప్రభుత్వాలు అవినీతి, కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొన్నాయని, మాన్ హయాంలో అలాంటి ఆరోపణలు ఒక్కటి కూడా లేవని అన్నారు. ఏవైనా తప్పులు చేసి ఉంటే ఈడీ, సీబీఐ చర్య తీసుకుని ఉండేవని అన్నారు. పంజాబ్‌లో పలు సంక్షేమ పథకాలను ఆప్ అమలు చేస్తోందని, ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా ప్రజలకు అందిస్తోందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. జూలై నుంచి అర్హత కలిగిన మహిళలకు ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.1,500 చొప్పున ఇస్తామని తెలిపారు. కేజ్రీవాల్ రోడ్‌షోలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా, పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఓ సుకుమారి...టీజర్ విడుదల




తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ..! సుకుమారి'. భరత్‌దర్శన్ దర్శకుడు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం టీజర్ విడుదలైంది. ఒక్క నిజం దాచి పెట్టి కథానాయకుడిగా పెళ్లి చేస్తే ఏం జరిగిందన్న ఆసక్తికర అంశానికి వినోదాన్ని జోడించి ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఝాన్సీ, మురళీధర్‌గౌడ్, ఆనంద్, అంజిమామ, శివానంద్, కోట జయరామ్ తదితరులు నటిస్తున్నారు.

# కలెక్షన్లలో దూసుకెళ్తున్న పెద్ది

### ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన 'పెద్ది' తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ. 366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో 'పెద్ది' రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది.ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'పెద్ది' త్వరలోనే రూ. 400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం 'పెద్ది'కి అదనపు బలంగా మారింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది.

# హాలీవుడ్‌లో మైఖేల్ మూవీ చరిత్ర

### సుమారు రూ. 8,673 కోట్ల భారీ వసూళ్లు

పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన బయోపిక్ 'మైఖేల్' ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకు మ్యూజిక్ బయోపిక్ చిత్రాలలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా ఉన్న 'బోహేమియన్ రాప్సోడి' రికార్డును ఈ చిత్రం తాజాగా దాటేసింది. హాలీవుడ్ మీడియా కథనాల ప్రకారం, 'మైఖేల్' సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 911.9 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,673 కోట్లు) భారీ వసూళ్లను రాబట్టింది. దీంతో గతంలో 910.9 మిలియన్ డాలర్ల లైఫ్‌టైమ్ కలెక్షన్లతో అగ్రస్థానంలో ఉన్న 'బోహేమియన్ రాప్సోడి'ని ఇది వెనక్కి నెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు 2022లో వచ్చిన ఎల్విస్ ప్రెస్లీ బయోపిక్ 'ఎల్విస్' రికార్డులను కూడా ఈ చిత్రం బద్దలు కొట్టింది. ఈ సినిమాకు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా.. జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్‌లో నటించాడు. ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో రెంటల్ విధానంలో స్ట్రీమింగ్ అవుతుంది.





# హిట్ అండ్ రన్ ..క్రైమ్ థ్రిల్లర్

సంజయ్ రావ్, నటాషా సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్ అండ్ రన్'. క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో రాబోతున్న ఈ సినిమాను సతీష్ రెడ్డి అల్లం, కె. శేఖర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సాయి కృష్ణ సాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన సంజయ్ రావ్ పాత్ర, ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్నాయి. 'హిట్ అండ్ రన్' కాన్సెప్ట్ తెలిసేలా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరిలోనూ అంచనాలు పెంచేసింది. తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ 'హిట్ అండ్ రన్' సినిమాలోని హీరోయిన్ పాత్రకు సంబంధించిన లుక్‌ను రివీల్ చేశారు. నటాషా సింగ్ ఈ సినిమాలో రిపోర్టర్ సాక్షి అనే పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో కనిపిస్తున్న కారు, వెనకాల ఉన్న డీటైల్స్ అన్నీ కూడా ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఇక హీరోయిన్ లుక్ కూడా చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. త్వరలోనే మేకర్స్ 'హిట్ అండ్ రన్' టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేయనున్నారు. ఈ సినిమాకి ప్రిన్స్ హెన్రీ సంగీతాన్ని అందిస్తున్నారు. డి. వెంకట్ ప్రభు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే... ఇప్పటికే మోడల్‌గా రాణిస్తూ, పలు కమర్షియల్ యాడ్స్ లో నటిస్తున్న నటాషా సింగ్ తెలుగులో 'హైలెస్సో' మూవీలోనూ యాక్ట్ చేస్తోంది. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న ఈ మూవీలో నటాషాతో పాటు నక్ష శరణ్ హీరోయిన్ నటిస్తోంది. అలానే అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తోంది. 'హైలెస్సో' మూవీ తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది. 'హిట్ అండ్ రన్, హైలెస్సో' చిత్రాలతో నటాషా ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటుందో చూడాలి.